క్లుప్తంగా

నార్లపూర్‌లో బీరన్నదేవుని పట్నాలు



మొక్కులు తీర్చుకుంటున్న సుమన్

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని నార్లపూర్‌లో ఆరు రోజులుగా కుర్మసంఘం ఆధ్వర్యంలో బీరన్నదేవుని జాతర కొనసాగుతోంది. ఆలయ ప్రాంగణంలో బుధవారం పట్నాలు వేయగా ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్ హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు, పూజారులు సుమన్‌కు ఆచారం ప్రకారం గొంగడి, కండువాను బహూకరించారు. ఆయన వెంట బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు కుర్మసంఘం నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్ అన్నారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసులను సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసుకోవచ్చని కక్షిదారులకు న్యాయవాదులు తెలియజేయాలన్నారు. కేసులను పరిశీలించి ముందుగానే వారితో చర్చించి మాట్లాడాలని వారికి అవగాహన కల్పించాలన్నారు. అధిక సంఖ్యలో కేసులను లోక్ అదాలత్‌లో తొలగించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కారుకూరి సురేందర్, ఏజీపీ పద్మ, న్యాయవాదులు అక్కల శ్రీధర్, సత్యనారాయణ, నళినికాంత్, తిరుపతిస్వామి, సత్యగౌడ్, రవి, గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని రాష్ట్ర మైనార్టీ గురుకుల బాలికల కళాశాలలో ఖాళీగా ఉన్న జువాలజీ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షబానా అన్సారీ ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో జువాలజీ పాఠాలు బోధించడానికి ఆసక్తి గల అభ్యర్థులు మంచిర్యాల డీఎండబ్ల్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఈడీ, ఎంఎస్సీ(జువాలజీ) చదివిన వారు ఈ పోస్టుకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ సెట్‌ను బెల్లంపల్లి కళాశాలలో అందజేయడంతో పాటు, మంచిర్యాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్:9502724286, 8978652487 ,8897396562 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విజేతలకు బహుమతి ప్రదానం

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. మొత్తం ఆరుజట్లు పాల్గొనగా, విన్నర్‌గా తాళ్లపేటకు చెందిన కోట్నాక ప్రేంసాగర్ టీం, రన్నర్‌గా బోడకుంటి వెంకటేష్ టీంలు నిలిచాయి. దీంతో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, మాజీ వైస్ఎంపీపీ రాజేందర్, స్థానిక నాయకుడు ముస్తాఫా, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న పద్మశాలీ కులస్తులు

భీమారం: మండల కేంద్రంలో నిర్మించనున్న పద్మశాలీ భవన నిర్మాణ పనులకు బుధవారం పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుడిమల్ల వెంకటేశ్ భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలీ కుటుంబాలు అధికంగా ఉన్నా ప్రభుత్వం ఏమాత్రం ప్రాధాన్యతనివ్వడం లేదన్నారు. మండల కేంద్రంలో భవనం నిర్మాణం కోసం చేపట్టిన పనులను త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. వార్డు సభ్యులు నరహరి, కులస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చెన్నూర్/దండేపల్లి: చెన్నూర్ మున్సిపాలిటీలోని 3వ వార్డు పరిధిలో గల మహంకాళి వాడకు చెందిన నిరుపేద ఆడబిడ్డ బొమ్మిడి లక్ష్మి వివాహానికి చెన్నూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు పట్టుచీరతో పాటు రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. దండేపల్లిలోని మేదరిపేటకు చెందిన కోటగిరి ప్రశాంత్ దంపతులకు బుధవారం ఆడకూతురు జన్మించగా నలిమెల వినయ్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా రూ.5వేల ప్రోత్సాహకం అందించారు.

బస్‌స్టేషన్ విస్తరించేదెప్పుడో..!

- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- ప్లాట్‌ఫారమ్ లేక రోడ్లపైన బస్సులు



చెన్నూర్ ప్లాట్‌ఫారమ్‌పైన నిలిపి ఉంచిన బస్సు. వెనకాల మరో బస్సు

మంచిర్యాలఅర్బన్: మెరుగైన రవాణా లక్ష్యం.. ప్రయాణికుల క్షేమం మా ధ్యేయం అని అధికారులు పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంటుంది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన బస్‌స్టేషన్ అసౌకర్యాల నడుమ కొట్టుమిట్టాడుతోంది. నిల్చోవటానికి స్థలం దొరకక, తాగుదామంటే గుక్కెడు నీరు దొరకక.. బస్సులు నిలుపుదామంటే స్థలం కొరత ఉన్నా అడ్డదిడ్డంగా నిర్మాణాలు మాత్రం చేస్తూనే ఉన్నారు. బస్‌స్టేషన్ విస్తరించకపోవటంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పటం లేదు. ఓ వైపు కార్గో సర్వీసు కేంద్రం, ఇంకోవైపు డిపో ముఖద్వారం ఉండటంతో చెన్నూర్ వైపు ప్లాట్‌ఫామ్‌పై బస్సులు నిలపటం .. అక్కడి నుంచి తీసే క్రమంలో ఇరుకుగా మారి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇతర జిల్లాలైనా కరీంనగర్, జగిత్యాల, గోదావరిఖని తదితర డిపోల నుంచి వందకు పైగా బస్సులు మంచిర్యాల బస్‌స్టేషన్‌కు రాకపోకలు సాగిస్తుంటాయి. జిల్లా కేంద్రమైన మంచిర్యాల బస్‌స్టేషన్ విస్తరిస్తే కానీ, ప్రయాణికులకు ఇక్కట్లు తప్పేలా లేవు.

మెరుగుపడని సౌకర్యాలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాగా ఉన్నప్పుడే మంచిర్యాల డిపో ఫిబ్రవరి 6న ,1975లో ఏర్పాటు చేశారు. 1980అక్టోబర్‌లో బస్‌స్టేషన్ నెలకొల్పారు. అదే సమయంలో బస్‌స్టేషన్‌లో తొమ్మిది ప్లాట్‌ఫాంలతో 32బస్సులతో ప్రారంభించారు. 3ఎకరాల 21గుంటల్లో డిపో, 1.34ఎకరాల్లో బస్‌స్టేషన్ నిర్మించారు. అప్పటి రవాణాశాఖ మంత్రి చొక్కారావు డిపోను, ముఖ్యమంత్రి చెన్నారెడ్డి బస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. 1985 నాటికి 32నుంచి 118కి బస్సుల సంఖ్య పెరిగాయి. ప్రయాణికుల సంఖ్య.. బస్సులు పెరిగినా ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో మాత్రం సౌకర్యాలు మెరుగుపడలేదు. ప్రస్తుతం డిపో పరిధిలో ఆర్టీసీ, అద్దెబస్సులు మొత్తం 145వరకు ఉన్నాయి. 530మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. బస్‌స్టేషన్ మీదుగా రోజుకు 60వేల కిలోమీటర్ల మేర బస్సులు నడిపి 25వేల మంది ప్రయాణికులను చేరవేస్తున్నారు. మొదట్లో ఉన్న ప్లాట్ ఫారమ్‌లు తప్పా, ఒక్కటి కూడా అదనంగా పెంచకపోవటంపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు.

ఆదాయంపై దృష్టి..

బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలకంటే అధికారులు వాణిజ్య సముదాయాలపైనే దృష్టి సారించారు. బస్టాండ్‌లో కనీస సౌకర్యాలైన తాగునీరు, కూర్చునేందుకు కుర్చీలు, ఉక్కపోత నుంచి ఉపశమనానికి ఫ్యాన్లు కల్పించకుండా ఆదాయం కోసం మార్గాలను అన్వేషిస్తూ వచ్చారు. 1985లో బస్‌స్టేషన్‌లో తొమ్మిది ప్లాట్‌ఫారమ్‌లు, 14 స్టాల్స్ ఏర్పాటు చేసిన అధికారులు ప్లాట్‌ఫారమ్‌ల సంఖ్యపై దృష్టిపెట్టకుండా 14నుంచి 29వరకు స్టాల్స్‌ను పెంచారు. దీంతో బస్‌స్టేషన్ చుట్టూ దుకాణాలు, మరుగుదొడ్ల నిర్మాణం జరిగి బస్‌స్టేషన్ ఇరుకుగా మారింది. దుకాణాల నిర్వాహకులు కేటాయించిన స్థలం కంటే ముందుకు వచ్చి వస్తువులు పెట్టడంతో స్థలం దొరక్కా ప్లాట్‌ఫాంలు, బస్‌లు నిలిపే స్థలంలో బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి.

డిపో తరలింపా.. కుదింపా..?

బస్‌డిపో తరలించాలనే ప్రతిపాదనలు అటకెక్కాయి. కరోనా ముందు వరకు డిపోను తరలించి ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్‌స్టేషన్ విస్తరించాలని అధికారులు యోచించారు. వెంపల్లి, ఏసీసీలో ట్రయల్ రన్ చేశారు. డిపో తరలింపు వల్ల డీజిల్ ఖర్చు ఎక్కువవుతుందని వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. అనువైన స్థలం దొరికే వరకు డిపోను కుదించి, బస్‌స్టేషన్ విస్తరిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం కేసీఆర్ కార్మిక పక్షపాతి

- ఎమ్మెల్యే దివాకర్ రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

శ్రీరాంపూర్: సీఎం కేసీఆర్ కార్మిక పక్షపాతి అని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. బుధవారం ఎస్ఆర్పీ3, 3ఏలపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు గతంలో ఏ ముఖ్యమంత్రి చేయనంత మేలు కేసీఆర్ చేశారన్నారు. కార్మికులకు అనేక హక్కులు, సదుపాయాలు కల్పించారని పేర్కొన్నారు. కారుణ్య ఉద్యోగాలు, సకల జనుల సమ్మె వేతనం, తెలంగాణ స్పెషల్ ఇంక్రిమెంట్, రూ.10లక్షల ఇంటి రుణానికి వడ్డీ చెల్లింపులు, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు, గుర్తింపు సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, పెట్టం లక్ష్మణ్, కానుగంటి చంద్రయ్య, గడ్డం మైపాల్ రెడ్డి, చేరాలు, గోపాల్‌రెడ్డి, రౌతు సత్యనారాయణ, నస్పూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ తోట శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కౌన్సిలర్ పూదరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన 'బడిబాట'

దండేపల్లి/జన్నారం/చెన్నూర్: ప్రభుత్వ పాఠశాలల బడిబాట కార్యక్రమం కొనసాగుతుంది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లోని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు వివరిస్తున్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. జన్నారం, దండేపల్లి, చెన్నూర్ మండలకేంద్రాల్లోని పలు గ్రామాల్లో తల్లిదండ్రులు, పిల్లలతో కలిసి ర్యాలీ తీశారు.

సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సిజేరియన్‌లకు తావివ్వొద్దని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చందర్ రెడ్డి, సీహెచ్‌సీ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ అరవింద్, ఎంసీహెచ్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయపూర్ణిమ, డీపీవో ప్రశాంతిలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ చిన్నారులకు టీకాలు, కేసీఆర్ కిట్ వివరాలను పోర్టల్‌లో నమోదు చేయడం, స్కానింగ్, 102 అంబులెన్సుల సర్వీసులు ఉండేలా చూడాలని తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మెంటల్ హెల్త్ సర్వీస్‌లు, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాలలో ఆరోగ్యపరమైన నివేదికలు సిద్ధం చేసుకుని, సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు సిద్ధం కావాలని తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

భీమిని/పాతమంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించబోయే కులవృత్తులు, చేతివృత్తుల వారికి రూ.లక్ష సాయం పథకానికి విశ్వబ్రాహ్మణులు దరఖాస్తు చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు మడుపు రాంప్రకాష్, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టల రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ పట్టణ సంఘం అధ్యక్షుడు పెద్దపల్లి పురుషోత్తం, నాయకులు రామోజు రాజేశ్వర్, కోటోజు రమేష్, కొక్కొండ రమణయ్య, శ్రీపాద రవి, అకెనపల్లి మధు, చింతల మధు తదితరులు పాల్గొన్నారు.

'పరేషాన్' సక్సెస్‌పై హర్షం

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులు, బొగ్గుగనుల ఇతివృత్తంగా తీసిన పరేషాన్ సినిమా విజయవంతం కావడంపై ఆ చిత్రయూనిట్ హర్షం వ్యక్తం చేసింది. చిత్ర రచయిత అక్కల చంద్రమౌళి, నటులు రాజేశ్, చిరు తదితరులు వారు షూటింగ్ చేసిన శ్రీరాంపూర్ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. కార్మికుల కుటుంబాలను కలిసి సినిమాను సక్సెస్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద స్థానిక ఎస్సై రాజేశ్‌ను కలిసి సినిమా టాక్‌పై చర్చించారు. సినిమాను సక్సెస్ చేసినందుకు వారు కార్మికవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నటీనటులు చిరు, విజయ్, రాజమోగిలి పాల్గొన్నారు.

బొట్టు పెడుతూ.. ఆహ్వానిస్తూ

కోటపల్లి/భీమారం/చెన్నూర్‌రూరల్/మందమర్రి రూరల్: మంచిర్యాల జిల్లా కేంద్రం నస్పూర్‌లో ఈ నెల 9న నూతన కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ రానుండడంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుధవారం ఊరూరా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. బొట్టు పెడుతూ ప్రజలను ఆహ్వానించారు. కోటపల్లిలో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, మద్దికల్‌లో మాజీ ఎంపీటీసీ రాము, సర్పంచ్ వాణి, చెన్నూర్‌లో జెడ్పీటీసీ తిరుపతి, మందమర్రిలో తిరుపతిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు కంపుకొడుతున్నయ్..!

- మురుగు నీటికి కేరాఫ్‌గా మినీ ట్యాంక్‌బండ్
- ఆదర్శనగర్ కాలనీ మురుగు నీరంతా కుమ్మరికుంటకు మళ్లింపు
- కలుషితమవుతున్న కుంటనీరు
- పట్టించుకోని అధికారులు



చెన్నూర్ ఆదర్శనగర్ కాలనీ నుంచి కుంటలో చేరుతున్న మురుగునీరు

చెన్నూర్: మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని కుమ్మరికుంటను రూ.3కోట్ల నిధులతో మినీట్యాంక్ బండ్‌గా నిర్మాణం చేపట్టారు. దీంతో పరిసర ప్రాంతం అభివృద్ధి చెంది, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. మినీట్యాంక్ బండ్ మురిగునీటికి కేరాఫ్‌గా మారింది. పరిసర ప్రాంత వాతావరణం కలుషితమైంది. కుమ్మరికుంటలో ఎగువ ప్రాంతంలో గల ఆదర్శనగర్ కాలనీ మురుగు నీటిని మినీ ట్యాంక్‌బండ్‌కు మళ్లించడంతో పరిసరాలు కంపు కొడుతున్నాయి. ట్యాంక్‌బండ్ పైకి వాకింగ్‌కు వెళ్లే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు ట్యాంక్‌బండ్‌లోకి మురుగునీటితో పాటు చెత్త చేరడంతో ట్యాంక్‌బండ్ నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. దిగువ ప్రాంతంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయం వెనుక కాలనీ ప్రజలు అనారోగ్య పాలవుతున్నారు. డ్రెయినేజీ నీరు చేరి కుమ్మరికుంట ఏరియాలో ఉండలేని పరిస్థితి నెలకొందని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక..

ఆదర్శనగర్ కాలనీలో పూర్తి స్థాయిలో డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణం కాలేదు. కాలనీలో డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడంతో ఇళ్ల ముందు మురుగు నీరు నిలువకుండా, మున్సిపాల్ సిబ్బంది మురుగు నీటిని కుమ్మరికుంటలోకి మళ్లించారు. దీంతో కుంటనీరు కలుషితంగా మారాయి. ఇప్పటికైనా మున్సిపాల్ అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, మినీ ట్యాంక్‌బండ్‌లోకి చేరుతున్న మురిగు నీటిని ఇతర ప్రాంతాలకు మళ్లించాలి. చెత్తాచెదారం చేరి కంపుకొడుతున్న కుమ్మరికుంటను శుభ్రం చేయించాలని కాలనీప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక డ్రెయినేజీ సిస్టం ఏర్పాటు చేస్తున్నాం



మినీ ట్యాంక్‌బండ్‌లోకి మురుగు నీరు చేరుతున్న మాట వాస్తవమే. ఆ మురుగునీటిని మళ్లించేందుకు ప్రత్యేక డ్రెయినేజీ సిస్టం నిర్మిస్తున్నాం. దిగువ భాగంలో పనులు ప్రా రంభించాం. మరో డ్రెన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. రెండు, మూడు నెలల్లో పూర్తిస్థాయిలో కుమ్మరికుంటలోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకుంటాం

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- బీడు భూములను సస్యశ్యామలం చేసింది 'బీఆర్ఎస్'
- అన్నదాతలకు అండగా ఉంటుందని భరోసా
- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: రాష్ట్రంలో గతంలో సాగునీరు లేక లక్షల ఎకరాల భూములు బీడుగా మారగా, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రాజెక్టులు కట్టి నిరంతరం సాగునీరందించామని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లిలోని ఆర్పీ గార్డెన్స్‌లో రాష్ట్ర ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన సాగునీటి దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరంతో పాటు ఇతర ప్రాజెక్టులు నిర్మించి దాదాపు 85లక్షల ఎకరాలకు సాగు నీరందించినట్లు తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో మిషన్‌కాకతీయ పథకం ద్వారా రూ.56.59కోట్ల నిధులతో 184చెరువుల్లో మరమ్మతు, పునరుద్ధరణ పనులు చేపట్టి వ్యవసాయం సాగుకు పుష్కలంగా సాగునీరు అందిస్తూ రైతన్నలకు ప్రభుత్వం అండగా నిలిస్తోందని సూచించారు. నీల్వాయి ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలో దాదాపు 8వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోందని తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ఇరిగేషన్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సాగులో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ జిల్లా అధికారి శ్రావణ్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ రమేష్, డీఈఈ నరేస్‌కుమార్, జెడ్పీ సీఈవో నరేందర్, జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్, ఏఎంసీ చైర్మన్ నిరంజన్, ఎంపీపీలు శ్రీనివాస్, ప్రణయ్‌కుమార్, లక్ష్మీ, రాజేశ్వరి, రమాదేవి, జెడ్పీటీసీలు బానయ్య, చంద్రయ్య, సత్యనారాయణ, ఇరిగేషన్ అధికారులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం 9వ వార్డులో పట్టణ ప్రగతిలో భాగంగా రూ.20లక్షల నిధులతో చేపట్టే బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

'డంపింగ్‌యార్డు సమస్య పరిష్కరించాలి'

బెల్లంపల్లిరూరల్: ప్రజలకు ఇబ్బందికరంగా మారిన డంపింగ్ యార్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డులో వ్యర్థాలు కాల్చడం ద్వారా కన్నాలబస్తీ, పాలిటెక్నిక్ ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించేందుకు కానీ, లేదా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి, బస్తీ వాసులకు సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏ.ఈ సందీప్, టీపీవో అశ్రిత్, కౌన్సిలర్లు, టూటౌన్స్ ఎస్సై రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై విచారణ జరిపించాలి



ఖాళీకుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని అసిస్టెంట్ లేబర్ కార్యాలయంలో కార్మికుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి రాజకీయ పార్టీల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. లేబర్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేయడానికి వచ్చిన నాయకులు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడంతో, ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పలు అవసరాల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన కార్మికుల నుంచి కార్యాలయానికి సంబంధం లేని వ్యక్తులు రూ.వేలల్లో డబ్బులు అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. ఈ వసూళ్లపై ఆ వ్యక్తులను కార్మికులు నిలదీయగా, ఉన్నతాధికారే డబ్బులు వసూలు చేయమని చెప్పారంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, అక్రమంగా దోపిడీకి పాల్పడుతున్నారని సూచించారు. ఈ విషయంపై వెంటనే విచారణ జరిపి, అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాజకీయ పార్టీల నాయకులు మద్దెల శ్రీనివాస్, పసులేటి వెంకటేష్, అల్లి సాగర్, పోచంపల్లి హరీష్, శనిగారపు శ్రావణ్ తదితరులు ఉన్నారు.

విగ్రహాల ప్రతిష్టాపనకు అనుమతివ్వాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్ ప్రాంతంలో మహనీయుల విగ్రహ ప్రతిష్టాపన కోసం అనుమతులివ్వాలని బహుజన ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన మహాత్మా జ్యోతిబా పూలే, అంబేడ్కర్, కుమురం భీం విగ్రహాల ఏర్పాటు కోసం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చార్వాక డంబ్ అండ్ డెఫ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్ తన సొంత స్థలాన్ని ధానం చేశారన్నారు. ఆ స్థలంలో విగ్రహాల ఏర్పాటుకు జిల్లా అధికారులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బహుజన ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మంతెన మల్లేష్, ఒడ్డేపల్లి మనోహర్, బోనగిరి రాజారెడ్డి, కలువల సంతోష్, పలిగిరి కనకరాజు, కోవ జంగు, గుండా రఘుపతి, సామల మనోజ్ రంగు రాజేశం, బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు భూ దాత డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'బీసీలకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి'

పాతమంచిర్యాల: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు మంచిర్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్‌ను బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 75శాతం బీసీల జనాభా ఉందన్నారు. బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కోకన్వీనర్‌లు సంగం లక్ష్మణ్, నస్పూరి అఖిల్, నాయకులు బోడంకి మహేశ్, నార్ల మహేందర్, మోలుగూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుడిపేటకు మహర్దశ



గుడిపేటలో మెడికల్ కళాశాల నిర్మాణ స్థలం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ సమీపంలో దాదాపు 40ఎకరాల స్థలంలో మెడికల్ కళాశాల నిర్మాణానికి బీజం పడుతోంది. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా 9వ తేదీ శుక్రవారం మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. గుడిపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటుపై ఆది నుంచి 'సాక్షి' దినపత్రికలో వరస కథనాలు ప్రచురితం కావడం.. ఆ కథనాలు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల దృష్టికి వెళ్లడం.. ఆపై మెడికల్ బోర్డు అధికారులు గుడిపేటలో మెడికల్ కళాశాల ప్రతిపాదిత స్థలాన్ని కలెక్టర్‌తో కలిసి సందర్శించడం వరసగా జరగడంతో ఎట్టకేలకు గుడిపేటకు మెడికల్ కళాశాల మంజూరయ్యింది. మంచిర్యాల గోదావరిరోడ్‌లోని భూదాన్ బోర్డ్ భూమి, నస్పూర్‌లోని సింగరేణి స్థలం, జైపూర్ మండలం ఇందారం, మంచిర్యాలలోని సాయికుంటలోని ప్రభుత్వ భూమి ఇలా ఎన్నో స్థలాలు ప్రతిపాదనలు చేసినా చివరకు హాజీపూర్ మండలంలోని గుడిపేట ఖరారు అయ్యింది. 2021జులైలో హాజీపూర్ మండలం గుడిపేటలో ప్రతిపాదించిన స్థలం ఖరారు కావడంతో ఈ ప్రాంత ప్రజలు సంబురాలు జరుపుకున్నారు. ఇక ఈ మెడికల్ కళాశాలను రూ.510కోట్లతో నిర్మాణం చేపట్టబోనున్నారు. ఏదిఏమైనా గుడిపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటు కానుండటంతో ఈ ప్రాంతం అభివృద్ధిలోకి రానుంది. ప్రస్తుతం మంచిర్యాల కాలేజ్ రోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలోని గోదాముల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనాల్లో, మెడికల్ కళాశాల కొనసాగుతోంది.

తాగునీటి వృథా అరికట్టండి

బెల్లంపల్లిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పోస్టాఫీస్ బస్తీలో తాగునీటి వృథాను అరికట్టాలని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు ఎండీ చాంద్‌పాషా అన్నారు. తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైపులైన్లు పగిలి నీరు వృథాగా పోతుందన్నారు.